PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :186 | పేజీలు : 8 | వెల రూ.5 | ఆదివారం 26.07.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh







# మెటాతో మీ సేవ!

## డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా ఏర్పాటు

**డిజిటల్ సేవలను గ్రామీణ స్థాయికి మరింత చేరువ చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అంతర్జాతీయ టెక్నాలజీ సంస్థ మెటా సహకారంతో రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలను డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్ లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమం ద్వారా చిన్న,మధ్య తరహా వ్యాపారులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికల్లో తక్కువ వ్యయంతో తమ ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేసుకునే అవకాశం కల్పించనుంది. తొలి దశలో 150 మంది మీ సేవ విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌కు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు.**
హైదరాబాద్,ప్రభాత సూర్యుడు

- మెటాతో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందం
- చిన్న వ్యాపారాలకు తక్కువ ఖర్చుతో సోషల్ మీడియా ప్రచారం
- మీ సేవ నిర్వాహకులకు అదనపు ఆదాయ మార్గం..
- తొలి విడతలో 150 మందికి శిక్షణ

### చిన్నవ్యాపారాలకు కొత్త మార్కెట్ అవకాశాలు

రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (మీ సేవ) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల వ్యాపారులకు కూడా ప్రొఫెషనల్ డిజిటల్ మార్కెటింగ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మెటా సంస్థ డిజిటల్ అడ్వర్టైజింగ్ నైపుణ్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీ సేవ కేంద్రాల నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయడం ద్వారా కొత్త మార్కెట్ అవకాశాలు కల్పించనున్నట్లు మీ సేవ కమిషనర్ టి. రవి కిరణ్ తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో క్యూర్ ప్రాంతానికి చెందిన 150 మందికి పైగా మీ సేవ నిర్వాహకులు పాల్గొన్నారు. మెటా నిపుణులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ ప్లాట్‌ఫారమ్‌లలో ప్రకటనల రూపకల్పన, వాట్సాప్ బిజినెస్ అకౌంట్ నిర్వహణ, లక్ష్య వినియోగదారుల ఎంపిక, డిజిటల్ ప్రచార వ్యూహాలు, ప్రచార ఫలితాల విశ్లేషణ వంటి అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు.

### ప్రభుత్వ సేవలతో పాటు డిజిటల్ మార్కెటింగ్ సేవలు కూడా..

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంతో ఇకపై మీ సేవ కేంద్రాలు ప్రభుత్వ సేవలతో పాటు డిజిటల్ మార్కెటింగ్ సేవలనూ అందించనున్నాయి. ప్రకటనల రూపకల్పన నుంచి సోషల్ మీడియా ప్రచార నిర్వహణ వరకు అన్ని సేవలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్న వ్యాపారులు తక్కువ ఖర్చుతో విస్తృతంగా వినియోగదారులను చేరుకోగలిగే అవకాశం లభించనుండగా, మీ సేవా కేంద్రాల నిర్వాహకులకు అదనపు ఉపాధి, ఆదాయ వనరులు కూడా ఏర్పడనున్నాయి. రాష్ట్రంలో డిజిటల్ వ్యాపారాభివృద్ధికి ఈ కార్యక్రమం కీలకంగా మారుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఇందిరమ్మ టవర్స్‌కు హెల్ప్‌లైన్ ప్రారంభం




హైదరాబాద్: ప్రభాత సూర్యుడు క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ గృహాల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో దరఖాస్తుదారులకు సమాచారం అందించనున్నారు. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేస్తూ, ఆధార్ కార్డు ఒక్కటే సరిపోతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో ఇతర పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే, రూ.10 వేల ఎర్నెస్ట్ మనీ డిపాజిట్‌ను యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒకవేళ ఫ్లాట్ కేటాయించకపోతే అదే బ్యాంకు ఖాతాకు ఈ మొత్తం తిరిగి జమ చేయనున్నట్లు వెల్లడించారు. క్యూర్ పరిధిలో కనీసం 10 సంవత్సరాలు నివాసం ఉండాలని మంత్రి తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలన్నారు. ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తారని పేర్కొన్నారు. అలాగే క్యూర్ లేదా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఇప్పటికే సొంత ఇల్లు లేదా స్థలం ఉన్నవారు ఈ పథకానికి అర్హులు కాదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అర్హుల సంఖ్య అందుబాటులో ఉన్న ఫ్లాట్ల కంటే ఎక్కువగా ఉంటే లాటరీ విధానంలో కేటాయింపులు చేపడతారని తెలిపారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ ధర రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉండగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని స్పష్టం చేశారు. మిగిలిన మొత్తంలో లబ్ధిదారుడు తన వాటాగా రూ.6 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా



ఢిల్లీ, ప్రభాత సూర్యుడు: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ పోటీ పరీక్షలో పేపర్ లీక్, పరీక్షల నిర్వహణపై తలెత్తిన వివాదాలు, విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వెలుగులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు నిరసనలు చేపట్టి, పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పరీక్షల వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు--2026 ముసాయిదాను విడుదల చేసి, పేపర్ లీక్‌లు, పరీక్షల అక్రమాలపై కఠిన శిక్షలు, భారీ జరిమానాలు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, కాలపరిమితిలో విచారణ వంటి కీలక నిబంధనలను ప్రతిపాదించింది. మరోవైపు, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో కేంద్ర మంత్రివర్గంలో విద్యాశాఖ బాధ్యతలను ఎవరు చేపడతారనే అంశంపై ఆసక్తి నెలకొంది. త్వరలోనే కొత్త విద్యాశాఖ మంత్రిని నియమించే అవకాశం ఉంది. అయితే రాజీనామాపై కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన, రాష్ట్రపతి ఆమోదం, తదుపరి బాధ్యతల కేటాయింపుపై పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉండగా, విద్యార్థి సంఘాలు ఈ పరిణామాన్ని స్వాగతిస్తూ, పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, బాధ్యులపై కఠిన చర్యలు, దీర్ఘకాలిక సంస్కరణలు అమలు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాయి.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమే



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ ఉద్యమానికి దక్కిన విజయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లపై కేంద్రం దిగివచ్చిందని, ఈ పరిణామం ప్రభుత్వాలకు ఒక కనువిప్పుగా మారాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి దక్కిన విజయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు కోసం దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు. విద్యార్థుల ఆవేదనను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైందని, చివరకు ప్రజల ఒత్తిడి ముందు తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదని, ప్రజల గొంతుకకు లభించిన గౌరవమని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ప్రభుత్వమైనా మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ రోజు దిగివచ్చిన ప్రభుత్వం రేపు గద్దె దిగక తప్పదని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆకాంక్షలను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

# మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో మంత్రి తుమ్మల భేటీ..

### రైతులకు అండగా నిలవాలని పిలుపు..



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు :తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. ఎల్-నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్-నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు.

# వారే నిజమైన దేశభక్తులు: రాహుల్ గాంధీ



ఢిల్లీ, ప్రభాత సూర్యుడు: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ చెబుతూ, వారే నిజమైన దేశభక్తులని కొనియాడారు. విద్యార్థులు తమ హక్కుల కోసం, పారదర్శకమైన విద్యా వ్యవస్థ కోసం చేసిన పోరాటం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని రాహుల్ పేర్కొన్నారు. వారి ఐక్యత, పట్టుదల చూస్తే గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఈ పరిణామం విద్యా రంగంలో సంస్కరణలకు దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'విద్యార్థులపై ఎవరైతే దాడి చేసి, వారిని కొట్టి, వారిపై కాల్పులు జరిపారో, వారందరికీ శిక్ష పడాల్సిందే. ఈ విషయాన్ని ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నాను' అని రాహుల్ పేర్కొన్నారు. అలాగే, దేశ విద్యార్థుల గౌరవం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భారత ప్రధానమంత్రి దాడులకు గురైన విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ సూచించారు.



# జిల్లాలో మై భారత్ నమోదు కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో విజయవంతం చేయాలి

## జిల్లా అడ్వైజరీ కమిటీ (ఖూజ), జిల్లా సమన్వయ కమిటీ (ఖూజ) సమావేశంలో అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి కొప్పిశెట్టి, ఐఏఎస్








రంగారెడ్డి జులై 25 ప్రభాత సూర్యుడు భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి సంస్థ మై భారత్ (మేరా యువ భారత్) చేపట్టిన ఇంటెన్సివ్ మై భారత్ రిజిస్ట్రేషన్ ఴ అవగాహన కార్యక్రమాన్ని జిల్లాలో మిషన్ మోడ్‌లో అమలు చేసి లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. కిరణ్మయి కొప్పిశెట్టి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. కిరణ్మయి కొప్పిశెట్టి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అడ్వైజరీ కమిటీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశాల్లో జిల్లాకు నిర్దేశించిన 80,251 మంది యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు లక్ష్య సాధనపై సమగ్రంగా సమీక్షించి, శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ సందర్భంగా మై భారత్ రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డైరెక్టర్, జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్య కార్యదర్శి శ్రీమతి బి. స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్ మాట్లాడుతూ, యువతలో స్వచ్ఛంద సేవా భావం, నాయకత్వ నైపుణ్యాలు, సామాజిక బాధ్యత, పౌర చైతన్యాన్ని పెంపొందించేందుకు మై భారత్ వేదికగా పని చేస్తోందని తెలిపారు. జిల్లాకు కేటాయించిన 80,251 మంది యువత నమోదు లక్ష్యాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, యువజన సంఘాలు, స్వయం సహాయక సంఘాలు తదితర సంస్థల సహకారంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక నమోదు శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతి అర్హత కలిగిన యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖలు వెంటనే నోడల్ అధికారులను నియమించి, నమోదు పురోగతిని ప్రతిరోజూ సమీక్షించాలని, జిల్లా మై భారత్ కార్యాలయంతో నిరంతర సమన్వయం కొనసాగించాలని ఆమె సూచించారు. జిల్లా లక్ష్యాన్ని సాధించడంలో అన్ని శాఖల సమిష్టి కృషి కీలకమని పేర్కొన్నారు. సమావేశం ముగింపులో జిల్లాలో మై భారత్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా పరిపాలన మరియు మై భారత్ సంస్థ జిల్లాలోని అర్హత కలిగిన యువత అందరూ వీ దీప్ఘుతీఫ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవ, సామాజిక సేవ, నాయకత్వ వికాసం, జాతి నిర్మాణ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశాయి. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి (గ్రాజజూ) కృష్ణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. డి. స్వర్ణకుమారి, జిల్లా పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకురాలు ఎస్.రాధాలలిత, జిల్లా పౌర సంబంధాల అధికారి బి.బాలేశ్వరి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జె.రామారావు, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు డా.ఎస్.రమేష్, డా.ఎ.రచన, డా. చింతల రాకేష్ భవాని, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు వి.పాండు, ఖజాంచీ రాఘవరెడ్డి, జిల్లా పర్యాటక అధికారి ఎస్.ప్రభాకర్, జిల్లా ఉపాధి అధికారి జి.జయశ్రీ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంక్య నాయక్, జిల్లా పంచాయతీ అధికారి వి. సురేష్ మోహన్, మై భారత్ ప్రతినిధులు శ్రీశైలం యాదవ్, శివకుమార్, శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి లో ఘనంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు.

## బ్లడ్ డొనేషన్ చేసిన ఎమ్మెల్యే అనుచరులు, సర్పంచ్ టోనీ. బ్లడ్ క్యాంప్, మహా అన్నదానం ఏర్పాటు.

సింగరేణి జూలై 25 ప్రభాత సూర్యుడు కరేపల్లి మండల కేంద్రంలో జనహృదయనేత వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తనయుడు విగ్నేష్ నాయక్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు డి.జె సౌండ్ సిస్టంతో సినిమా హాల్ సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి జై రాందాస్ నాయక్.. జై జై రాందాస్ నాయక్ అంటూ నినాదాలు చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సినిమా సెంటర్ వద్ద బ్లడ్ క్యాంప్ నిర్వహించారు. ఈ బ్లడ్ డొనేషన్లు కారేపల్లి సర్పంచ్ టోనీ స్వచ్ఛందంగా బ్లడ్ డొనేషన్ చేశారు. అనంతరం మహా అన్నదాన ఏర్పాటు చేయగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విగ్నేష్ నాయక్,సర్పంచ్ మేదరి టోనీ, సర్పంచ్ హిరాలాల్, ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి, తిరుమలరావు, మైనార్టీ నాయకులు షఫీ, యాకూబ్ ఆలీ, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, డైరెక్టర్ ఐలయ్య, తదితరుల పాల్గొన్నారు.





# సేవే లక్ష్యం- ప్రజా సేవే నా మార్గం

## ప్రాణం కోసం పోరాడుతున్న చిన్నారికి అండగా నిలిచిన శ్రీరామకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్, బాడిశ నాగరమేష్

ములుగు జూలై 25, ప్రభాత సూర్యుడుములుగు జిల్లా వెంకటాపురం మండలం బెస్తగూడెం గ్రామవాస్తవ్యులు రాజేష్ -మమత వారి పాప 5ఇయర్స్ నుండి బోన్ మరో జెనెటిక్ అనే హెల్త్ ప్రాబ్లమ్స్ తో బాధపడుతుంది ఈ విషయం తెలుసుకున్న శ్రీ రామకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా యువ నాయకులు బాడిశ నాగరమేష్ ఆ చిన్నారి పాప వాళ్ళ ఇంటికి వెళ్లి ఆ పాప ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని, పాప తల్లిదండ్రులకు మనో ధైర్యాన్ని అందించి తనవంతు సహాయంగా చిన్నారి వైద్య ఖర్చు లా నిమిత్తం 15000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో బెస్తగూడెం సర్పంచు బట్ట బిమేశ్వరి ,జిల్లా నాయకులు మంచర్ల నాగేశ్వరావు, బట్ట నాగేంద్ర బాబు వీరభద్రవరం సర్పంచ్ సాలం ఓంపతీ, కొమరం పుల్లారావు, పండ శ్రీను,రూప భద్రయ్య, సంతోష్, బన్ను,సలేం ఓంపతీ, మాటూరి వెంకటేశ్వర్లు,బట్ట పురుషోత్తం, సుదర్శన్,దారాజు కృష్ణ మూర్తి,బెగా సాంబాశివరావు, రామేళ్ల రాజా శేఖర్, రాకేష్, లక్ష్మీనారాయణ,రంజిత్,బట్ట జగదీష్, చంటి, గోవర్ధన్ వంశీ వెంకటేష్, వీరాస్వామి సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ పాల్గొన్నారు



# భద్రాచలంలో 101 కిలోల డ్రై గంజాయి స్వాధీనం..

## నలుగురు నిందితుల అరెస్ట్ -- కారు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం..

భద్రాచలం 25 జులై ప్రభాత సూర్యుడుభద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం (25-07-2026) మధ్యాహ్నం 2.30 గంటలకు పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో భారీగా డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (గ్రాఖూ) ఆధ్వర్యంలో పోలీసులు వీరభద్రం ఫంక్షన్ హాల్ సమీపంలో, కూనవరం రోడ్డుపై నిర్వహించిన తనిఖీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మోతుగూడెం ప్రాంతం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న 101 కిలోల డ్రై గంజాయిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా కర్ణాటక రిజిస్ట్రేషన్ నంబర్ ఖూ-03-చీ=-5892 గల మారుతి ఎర్టిగా కారును, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేశారు.



అరెస్టైన నిందితులు:

1. సలీం పాషా (53), బొమ్మనహల్లి, బెంగళూరు దక్షిణ, కర్ణాటక.
2. ఈ. రాజేంద్ర ప్రసాద్ (34), నల్లమడ, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3. ఎం.డి. అర్బాజ్ హుస్సేన్ (22), బొమ్మనహల్లి, బెంగళూరు దక్షిణ, కర్ణాటక.
4. ఎస్. గుల్జార్ (35), జయనగర, నెలమంగల, బెంగళూరు గ్రామీణ జిల్లా, కర్ణాటక.

ప్రాథమిక విచారణలో నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మోతుగూడెం నుంచి గంజాయిని భద్రాచలం--ఖమ్మం మార్గం గుండా బెంగళూరుకు రోడ్డు మార్గంలో తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ దాడిలో సీఐ రహీమున్నీసా, ఎస్ఐ సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ కరీమ్, పోలీసు సిబ్బంది భద్రం, సీతారాం, రాకేష్, రవి పాల్గొన్నారు.


# సేంద్రీయ ఎరువులతో పండిస్తున్న బ్లాక్ రైస్ పంటలను పరిశీలించిన ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్..

భద్రాచలం జూలై 25 ప్రభాత సూర్యుడు ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, జీసిసి ద్వారా అటవీ ఉత్పత్తులు మరియు గిరిజన, ఎస్ హెచ్ జి మహిళలకు చేయూత అందించడానికి నెలకొల్పిన భద్రగిరి మార్ట్ విశేష ఆదరణ పొందడంతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు నిత్యవసర సరుకులతో పాటు వివిధ రకాల ధాన్యాలు ఆర్గానిక్ సంబంధించినవే భద్రగిరి మార్ట్ లో లభించేలా ఇప్పటినుండే రైతులకు సూచనలు అందించి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శనివారం సాయంత్రం ఏటపాక మండలంలోని కొత్తూరు నారాయణపురం గ్రామంలో ఎస్ హెచ్ జి మహిళలు పూర్తిగా సేంద్రియ ఎరువులతో పండిస్తున్న బ్లాక్ రైస్ పంటలను పరిశీలించి పండించిన విధానాన్ని గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం పరిసర ప్రాంతాల్లోని మహిళా సంఘాలు తయారుచేసిన ఆర్గానిక్ వస్తువులకు దేశవ్యాప్తంగా డిమాండ్ పెరుగుదలతో వివిధ రాష్ట్రాల నుండి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆకర్షించేలా భద్రగిరి మార్ట్ నెలకొల్పడం జరిగిందని అన్నారు. భద్రగిరి మార్ట్ లో పూర్తిస్థాయిలో లభించే ప్రతి నిత్యవసర సరుకులు ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, అడవి నుంచి సేకరించిన అటవీ ఉత్పత్తులు గిరిజన మహిళలు సొంతంగా తయారు చేస్తున్న మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్లు అలాగే వివిధ రకాల పచ్చళు ళ్ళ, నెయ్యి, తేనెతోపాటు ఎద్దుగానుగతో తయారుచేసిన కల్తీ లేని నూనె ఇతర నిత్యావసర సరుకులకు మంచి డిమాండ్ ఉండడంతో భద్రగిరి మార్ట్ కు ప్రజల ఆదరణ పెరుగుతుందని అన్నారు. భద్రగిరి మార్ట్ కు సరఫరా చేసే ఇతర నిత్యవసర సరుకులను మూడు నెలలకు ఒకసారి ఐటీడీఏ ద్వారా నియమించబడ్డ ప్రత్యేక బృందాలు వారి గ్రామాలకు వెళ్లి పూర్తిస్థాయిలో పరిశీలించి నాణ్యమైన సరుకులనే సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సరఫరా చేసే నిత్యవసర సరుకులు ఏమాత్రం కల్తీ జరిగినట్లు పరీక్షలో తేలితే వెంటనే వారిని తొలగించడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం ఏటపాక మండలంలోని కొత్తూరు నారాయణపురం గ్రామంలోని ఎస్ హెచ్ జి మహిళలు సొంతంగా సేంద్రీయ ఎరువులతో పండిస్తున్న బ్లాక్ రైస్ పంటలను అలాగే నాటుకోడి గుడ్లు, పాలు, పెరుగు, నెయ్యి ఇతర ఆర్గానిక్ సంబంధించిన తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, సరఫరా చేయడానికి ముందుకు వచ్చినందున, త్వరలో వారి ఇండ్లను సంప్రదించి వారు సరఫరా చేసే నిత్యవసర సరుకులను పరిశీలించిన మీదట గిట్టుబాటు ధర మాట్లాడుకొని భద్రగిరి మార్ట్లో లభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటపాక ఏపీవో భాస్కరరావు, జిసిసి మేనేజర్ జయరాజ్, ఎస్ హెచ్ జి మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# తొలి ఏకాదశి సందర్భంగా ఉద్దమర్రి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మూడు చింతలపల్లి: ప్రభాత సూర్యుడుమేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మూడు చింతలపల్లి మండల పరిధిలోని ఉద్దమర్రి గ్రామంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీ విష్ణు ఆలయం, శ్రీ శివాలయం, అక్కన్న--మాదన్న దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి అన్న సత్రం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ రావు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయన కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కత్తుల సుదర్శన్ రావు మాట్లాడుతూ, తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని దైవానుగ్రహాన్ని పొందాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, భక్తులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు.



# పిఎంఆర్ బిల్డింగ్ మెటీరియల్ ట్రేడింగ్ మేనేజర్ తాడూరి మహేష్- లక్ష్మి వారు సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ కు విరాళం అందజేత

ప్రభాత సూర్యుడువేములవాడ :పిఎంఆర్ బిల్డింగ్ మెటీరియల్ ట్రేడింగ్ మేనేజర్ తాడూరి మహేష్- లక్ష్మి వారు సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ కు గురు పౌర్ణమి సందర్భంగా వచ్చే భక్తుల కూ అన్న వితరణ కార్యక్రమం కొరకు 5000/- రూపాయలు విరాళంగా అందజేయడం జరిగింది. సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను గుర్తించి భక్తులకు అన్నదానం కొరకు ఈ విరాళం అందజేయడం జరిగినది అని తాడూరి మహేష్-లక్ష్మి తెలియజేశారు. మా ట్రస్ట్ కు విరాళం అందించిన పి ఎమ్ ఆర్ బిల్డింగ్ మెటీరియల్ ట్రేడింగ్ దుబాయ్ మేనేజర్ తాడూరి మహేష్-లక్ష్మి గార్ల కూ సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎద్దండి రాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

# నరసాపురంపాఠశాలను సందర్శించిన శాసనసభ్యులు ఎం ఎల్ ఏ వెంకట్రావు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్...

భద్రాచలం జూలై 25 ప్రభాత సూర్యుడుభద్రాచలం శాసనసభ సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు . ఐ.టి.డి.ఏ. ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ నరసాపురం గ్రామంలోని సూది రెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించడం జరిగింది. పాఠశాలలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పూజారి రత్నకుమారి, ఎ ా ం . ్ శ ా ల



ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు అతిథులను ఆహ్వానించడం జరిగింది. పాఠశాల వసతులను గూర్చి గౌరవ శాసనసభ్యులు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో బాలురకు మూత్రశాలలు మరుగుదొడ్ల మరమ్మత్తులు చేయించవలసిన అవసరాన్ని తెలియజేశారు. పాఠశాలలో త్రాగునీటి కొరత అధికంగా ఉందని ప్రతినెల 4000 రూపాయలు ఖర్చు పెడుతున్నామని , గ్రామంలోని మిషన్ భగీరథ గ్రిడ్ నుండి డైరెక్ట్ గా పాఠశాలకు కనెక్షన్ ఇప్పించ వలసినదిగా ఒక బోర్ ని కూడా పాఠశాలలో ఏర్పాటు చేయవలసినదిగా గౌరవ ఎమ్మెల్యే ని కోరడం జరిగినది. పై సమస్యల పట్ల ఎమ్మెల్యే గారు సానుకూలంగా స్పందించడం జరిగినది. అనంతరం పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పూజారి రత్నకుమారి ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు పాఠశాలకు విచ్చేసిన భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు ను మరియు ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ రాహుల్ లకు పూల గుచ్చాలు అందించి ఘనంగా శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొనడం జరిగినది.శ్రీ

# "శ్రీ మౌనిక ఫ్యాబ్రిక్ ప్రింట్స్" ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు..

భద్రాచలం జూలై 25ప్రభాత సూర్యుడుభద్రాచలం పట్టణ పరిధిలోని ఐటిడిఎ (ఖణాూ) రోడ్, రూపా స్కూల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన "శ్రీ మౌనిక ఫ్యాబ్రిక్ ప్రింట్స్" షాప్ను భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్



తెల్లం వెంకట్రావు శనివారం ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దినేని శ్రీనివాస్, భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ 8వ వార్డు సభ్యురాలు పెద్దినేని లక్ష్మి ల కుమార్తె మౌనిక ఈ నూతన వ్యాపార సంస్థను నెలకొల్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తూ వ్యాపార రంగంలోకి రావడం అభినందనీయం. నూతనంగా ప్రారంభించిన శ్రీ మౌనిక ఫ్యాబ్రిక్ ప్రింట్స్ సంస్థ సేవలు స్థానిక ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరం. ఈ వ్యాపారం మరింత అభివృద్ధి చెంది, నిర్వాహకులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను."అనంతరం సంస్థ నిర్వాహకులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ని, గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ ని శాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

# ఎల్-నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం

**- జూలై 27--29 వరకు అన్ని మండలాల్లో విత్తన మేళాలు**

రంగారెడ్డి -- ప్రభాత సూర్యుడుఎల్-నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపేలా వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు జూలై 27, 28, 29 తేదీల్లో జిల్లాలోని అన్ని మండలాల రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి సుజాత తెలిపారు.జిల్లా, మండల స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కంటింజెన్సీ



ప్రణాళికను రూపొందించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ప్రణాళికలో భాగంగా 24 మండలాల రైతు వేదికల్లో కంది, పెసర, ఆముదం, సజ్జలు, ప్రొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలతో పాటు వివిధ రకాల కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.రైతులు తమ ప్రాంత పరిస్థితులకు అనుకూలమైన నాణ్యమైన విత్తనాలను ఈ విత్తన మేళాల ద్వారా కొనుగోలు చేసి, ప్రభుత్వ సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సుజాత కోరారు.

# ప్రతి ఇంటికి ఐదు ఉచిత మొక్కలు పంపిణీ

## వన మహోత్సవం--2026లో భాగంగా హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో కార్యక్రమం

కూకట్పల్లి, జూలై 25 ప్రభాత సూర్యుడు: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)





అర్బన్ ఫారెస్ట్రీ విభాగం, రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ఉచితంగా ఐదు మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో మూడు పండ్ల మొక్కలు, రెండు అలంకరణ లేదా ఔషధ మొక్కలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత్ గోపిడి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం--2026లో భాగంగా హైదరాబాద్ నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, భూగర్భ జలాలను సంరక్షించడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలను భాగస్వాములను చేస్తూ ప్రతి ఇంటికి ఐదు మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 16 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంతో వన



మహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మందలపు సాయిబాబు చౌదరి, హెచ్ఎండీఏ అసిస్టెంట్ డైరెక్టర్ (హార్టికల్చర్) చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్, రమేష్, రాణి తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై మొక్కలను స్వీకరించారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందించాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.

ఖమ్మం, జూలై 25 ప్రభాత సూర్యుడుప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించేందుకు అధికారులు, వైద్యులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా సేవల నాణ్యతను మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు.శనివారం రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్ సేవలు, మెడికల్ వార్డులు, రోగుల నమోదుతో పాటు



ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు.క్యాజువాలిటీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు మందులు, పరీక్షలు, చికిత్సలు సకాలంలో అందుతున్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు.ఆసుపత్రిలోని ఔషధ నిల్వల గదిని పరిశీలించిన కలెక్టర్, అత్యవసర మందులతో పాటు సాధారణంగా వినియోగించే అన్ని రకాల మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా పటిష్టమైన నిల్వల నిర్వహణ చేపట్టాలని సూచించారు. మందుల కొరత కారణంగా ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికతో స్టాక్ ఉంచుకోవాలని సూచించారు. లఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ల్యాబ్ పరీక్షలు, డయాగ్నస్టిక్ హబ్ సేవలను సమర్థవంతంగా వినియోగించి రోగులకు అవసరమైన పరీక్షల ఫలితాలను వీలైనంత త్వరగా అందించాలని ఆదేశించారు. పరీక్షల నివేదికలు ఆలస్యమైతే చికిత్స కూడా ఆలస్యమవుతుందని, అందువల్ల సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రోగులకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు ఒకే చోట అందేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ అన్నారు.ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణం, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, రోగులు కూర్చునే ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు నమ్మకమైన ఆరోగ్య సేవల కేంద్రాలుగా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ప్రతి ప్రత్యేక వైద్య విభాగానికి సంబంధించిన సేవలు, వైద్యుల అందుబాటు రోజులు, పరీక్షల వివరాలు, చికిత్స విధానాలు, మందుల నిల్వల సమాచారం ఆసుపత్రి ఆవరణలో స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, ఎంపీడీవో అశోక్ సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# నరసాపురం పీహెచ్సీలో ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల బ్లాక్, వైద్య పరికరాల ప్రారంభోత్సవం..

దుమ్ముగూడెం జూలై 25 ప్రభాత సూర్యుడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)లో ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ ( ఎం ఎస్ కె ) ఆధ్వర్యంలో నూతనంగా



నిర్మించిన మరుగుదొడ్ల బ్లాక్తో పాటు వైద్య పరికరాల ప్రారంభోత్సవం పీహెచ్సీకి అందజేత కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి భద్రాచలం నియోజకవర్గ శాసన సభ్యులు డా. తెల్లం వెంకట్రావు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, ఐ ఏ ఎస్ ముఖ్య అతిథులుగా హాజరై మరుగుదొడ్ల బ్లాక్ను ప్రారంభించి, వైద్య పరికరాలను పీహెచ్సీకి అందజేశారు.ఈ కార్యక్రమంలో నరసాపురం సర్పంచ్ శ్రీమతి కనక రత్నం , డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. శ్రీధర్ , దుమ్ముగూడెం మండల ఎంపీడీవో , పీహెచ్సీ వైద్యాధికారి డా. శరత్ , ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ జయప్రకాశ్, ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రీమతి గీత ప్రవల్లిక , హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియ సంస్థ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఇతర అధికారులు ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ సంస్థ ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం సమగ్ర కమ్యూనిటీ అభివృద్ధి రంగాల్లో



చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో ఇటువంటి మౌలిక సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు.

# సురేందర్ మణియర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు.

**కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు.**




సింగరేణి జులై 25 ప్రభాత సూర్యుడు(కారేపల్లి) మండల కేంద్రంలో శనివారం వైరా ఎమ్మెల్యే బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలు వాణిజ్య జిల్లా ఉపాధ్యక్షులు సురేందర్ మణియర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జై రాందాస్.. జై జై రాందాస్ నాయక్ అంటూ నినాదాలు చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో జిల్లా వాణిజ్య ఉపాధ్యక్షులు సురేందర్ మణియర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా జోష్ తో కాంగ్రెస్ శ్రేణులు జన్మదిన వేడుకలు విజయవంతంగా చేశారు. ఈ సందర్భంగా జిల్లా వాణిజ్య ఉపాధ్యక్షులు సురేందర్ మణియర్ మాట్లాడుతూ పేదల పెన్నిధి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అనునిత్యం ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరించే దిశగా అడుగులు వేస్తూ వైరా నియోజకవర్గ అభివృద్ధికి నందిగా నిలుస్తున్నారని అన్నారు. దేవుని ఆశీస్సులు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పై ఎల్లవేళలా ఉండాలని భగవంతుని ఆశీస్సులతో మరోసారి వైరా ఎమ్మెల్యేగా గెలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాణిజ్య ఉపాధ్యక్షులు సురేందర్ మణియర్,మాజీ సొసైటీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు ఆదేర్ల రాములు,జిల్లా నాయకులు రామ్మూర్తి నాయక్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, సొసైటీ డైరెక్టర్ దేగల ఉపేందర్ సర్పంచ్ సంఘం అధ్యక్షులు రంజిత్, కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ఉమాశంకర్, గోపాల్, ఛాయాదేవి, ముజ్జు, పుల్లారావు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి వ్యవసాయంతోనే రైతు అభివృద్ధి

**ఎఫ్పీఓలే భవిష్యత్కు బాటలు**

**కారేపల్లిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ అవగాహన సదస్సు**

సింగరేణి జులై 25 ప్రభాత సూర్యుడు. చిన్న,సన్నకారు రైతులను సమిష్టి వ్యవసాయ విధానంలో ముందుకు తీసుకెళ్లి,తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సాధించేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్పీఓలు) కీలక పాత్ర పోషిస్తున్నాయని కోఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య అన్నారు.శనివారం కారేపల్లిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్పీఓ),కారేపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు దుగ్గినేని శ్రీనివాసరావు అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చిన్న రైతులకు చేరవేయడమే ఎఫ్పీఓల ప్రధాన ఉద్దేశమన్నారు.రైతు రూ.2,000 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే ప్రభుత్వం మరో రూ.2,000 వాటాగా జమ చేస్తుందని,ఆ నిధులతో రైతులకు అవసరమైన సేవలు సంస్థ ద్వారా అందిస్తామని తెలిపారు.ఎఫ్పీఓలో మొత్తం 750 మంది సభ్యులకు అవకాశం ఉండగా,ఇప్పటికే కారేపల్లి ఎఫ్పీఓలో 400 మంది సభ్యులు చేరి కార్యకలాపాలు ప్రారంభించారని వివరించారు.వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కవిరాజ్ మాట్లాడుతూ,వరిని నేరుగా విత్తే సాగు పద్ధతి ద్వారా ఖర్చు,నీటి వినియోగం తగ్గడంతో పాటు అధిక దిగుబడి సాధ్యమవుతుందని తెలిపారు.ఈ విధానంలో పంట కాలం సుమారు 15 రోజులు తగ్గుతుందన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని,వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని సూచించారు.అనంతరం భూసార పరీక్షల నిర్వహణ విధానాన్ని వివరించి రైతులకు భూసార పరీక్ష కిట్లను పంపిణీ చేశారు.అలాగే సమిష్టి వ్యవసాయం అభివృద్ధికి రైతులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్పీఓ డొమైన్ ఎక్స్పర్ట్ చావా అరుంధతి,సీఈవో బొల్లు హనుమంతరావు,దిశ కమిటీ సభ్యురాలు దారావత్ హేమలత బాలాజీ,సర్పంచ్లు అంగోత్ మత్రు,ఈసాల వెంకటేశ్వరరావు,భూక్య పద్మ,భూక్య రంజిత్ కుమార్,పూసం రామారావు,సహకార సంఘం డైరెక్టర్లు,రైతు ప్రతినిధులు,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.





# హాలీవుడ్ కూడా టాలీవుడ్ బాట పడుతోంది!

సాధారణంగా తెలుగు సినిమాల్లో విలన్ పాత్రలు స్థానిక రౌడీలు .. గ్యాంగ్‌స్టర్ల చుట్టూ తిరుగుతుంటాయి. కానీ –రణబాలి– చిత్రంలో విలనిజం హద్దులు చెరిపేసి గ్లోబల్ లెవెల్‌లో ఉండబోతోందని తెలుస్తోంది. ప్రస్తుతం టాలీవుడ్ ప్రాంతీయ హద్దులను చెరిపేస్తూ ప్రపంచ స్థాయి చిత్రాలను తెరకెక్కించడానికి ఎంతో ఆసక్తిగా ఉంది. ఒకప్పుడు తెలుగు సినిమాల్లో విదేశీ నటులు చిన్నపాటి అతిథి పాత్రల్లో లేదా డాన్సర్లుగా మాత్రమే కనిపించేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది. టాలీవుడ్ దర్శక నిర్మాతల ఆలోచనా విధానం గ్లోబల్ రేంజ్‌కు వెళ్ళింది. దీనికి నిదర్శనంగా –రణబాలి– చిత్రం నిలుస్తోంది. ఈ చిత్రంలో హాలీవుడ్‌ను ఓ ఊపు ఊపిన ప్రముఖ నటుడు అరంగేట్రం చేస్తుండటం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టాలీవుడ్వార్తలు



ప్రపంచవ్యాప్తంగా అపారమైన క్రేజ్ సంపాదించుకున్న కల్ట్ హాలీవుడ్ మూవీ –ది మమ్మీ– ఫేమ్ ఆర్నాల్డ్ వోస్లూ –రణబాలి– చిత్రంలో పవర్‌ఫుల్ విలన్‌గా నటిస్తున్నారు. ఆయనలాంటి ఇంటర్నేషనల్ స్టార్ తెలుగు తెరపై విలన్‌గా కనిపించడం అంటే సాధారణ విషయం కాదు. టాలీవుడ్ మేకర్స్ ఆలోచనలు ఏ స్థాయిలో విస్తరిస్తున్నాయో? చెప్పడానికి ఈ కాంబినేషనే అతిపెద్ద ఉదాహరణ. హాలీవుడ్ విలన్ ఎంట్రీతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటున్నాయి. సాధారణంగా తెలుగు సినిమాల్లో విలన్ పాత్రలు స్థానిక రౌడీలు .. గ్యాంగ్‌స్టర్ల చుట్టూ తిరుగుతుంటాయి. కానీ –రణబాలి– చిత్రంలో విలనిజం హద్దులు చెరిపేసి గ్లోబల్ లెవెల్‌లో ఉండబోతోందని తెలుస్తోంది. ఆర్నాల్డ్ వోస్లూ పోషించే పాత్ర కేవలం పేరుకు మాత్రమే కాకుండా కథను మలుపు తిప్పే అత్యంత క్రూరమైన పాత్రగా ఉండ నుందని సమాచారం. ఆర్నాల్డ్ స్క్రీన్ ప్రెజెన్స్, హావభావాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టీమ్ ధీమా వ్యక్తంచేస్తుంది. ఇలా హాలీవుడ్ నటులను తెలుగు సినిమాలకు రప్పించడం ద్వారా ఇక్కడి చిత్రాలకు గ్లోబల్ మార్కెట్‌లో తలుపులు వాటంతట అవే తెరుచుకుంటాయి. విదేశీ ప్రేక్షకులను కూడా తెలుగు సినిమాల వైపు ఆకర్షించడానికి ఇదొక అద్భుతమైన వ్యూహం. టాలీవుడ్ ఇప్పుడు భారతదేశాన్ని మాత్రమే కాకుండా హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వాల్యూస్.. నటీనటులతో ప్రపంచ ప్రేక్షకులను టార్గెట్ చేస్తోంది. –రణబాలి– సినిమాతో ఈ ట్రెండ్ మరింత ఊపందు కుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన వార్తలు బయటకు వచ్చినప్పటి నుంచి సోషల్ మీడియాలో అభిమానుల ఉత్సాహం తారాస్థాయికి చేరింది.

# ఫ్యాన్స్ తో అక్కినేని బాండింగ్ ఎంతలా ఉందంటే?



అక్కినేని కుటుంబ అభిమానుల ప్రత్యేకత ఏమిటంటే.. ఇది కేవలం ఒక హీరోకు సంబంధించిన ఫ్యాన్స్ అసోసియేషన్ కాదు. అభిమాని కళ్లలో హ్యాపీ నెస్.. హీరో కళ్లలో అఫెక్షన్.. ఆ రెండు కలిసిన మూమెంట్స్ ఎప్పుడూ స్పెషలే. అక్కినేని ఫ్యామిలీకి, వారి అభిమానులకు మధ్య ఉన్న రిలేషన్ కూడా అలాంటిదే. కేవలం సినిమా విడుదలల వరకు మాత్రమే పరిమితం కాని ఆ రిలేషన్.. జెనరేషన్లను మారినా కొనసాగుతూనే ఉంది. తాజాగా అఖిల్ అక్కినేని చేసిన కామెంట్స్ మరోసారి అక్కినేని ఫ్యాన్ బేస్ స్పెషాలిటీని గుర్తు చేశాయి. తన ఫ్యాన్స్ తనకు కుటుంబ సభ్యుల్లాంటి వారని అఖిల్ అక్కినేని చెప్పడం ఇప్పుడు వైరల్ అవుతోంది. ప్రతి ఒక్కరితో మాట్లాడలేకపోయినా.. కొందరు అభిమానులతో మాత్రం ప్రత్యేకంగా కమ్యూనికేట్ చేస్తుంటానని ఆయన తెలిపారు. అభిమానులు లేకపోతే తాము ఈ రేంజ్ లో ఉండేవాళ్లం కాదంటూ అఖిల్ చేసిన కామెంట్స్ హీరో, అభిమానుల మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తున్నాయి. ఇటీవల లెనిన్ సినిమా సక్సెస్ మీట్ సందర్భంగా అఖిల్ తన వీరాభిమాని నాగరాజును కలిశారు. అఖిల్ ను ఎప్పటి నుంచో చూడాలని ఎదురుచూస్తున్న నాగరాజు.. తన అభిమాన హీరోను కలిసిన సమయంలో ఎమోషనల్ అయ్యారు. ఆ ఇన్సిడెంట్ అభిమానులకు, హీరోలకు మధ్య ఉండే అనుబంధానికి ఒక ఉదాహరణగా నిలిచింది. అక్కినేని ఫ్యామిలీకి అభిమానులతో ఉన్న రిలేషన్ కొత్తదేం కాదు. దాదాపు ఏడు దశాబ్దాలుగా ఆ ఫ్యామిలీ తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు కాలం నుంచే ఆ జర్నీ మొదలైంది. ఏఎన్నార్ కుటుంబ ప్రేక్షకులను, ముఖ్యంగా మహిళా ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నారు. ప్రేమ, కుటుంబ విలువలు, భావోద్వేగాలతో కూడిన సినిమాలతో ఆయనకు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఆయన డిసిప్లైన్, పర్సనాలిటీ అభిమానులను మరింత దగ్గర చేసింది.ఆ తర్వాత నాగార్జున తనదైన శైలిలో ఆ ఫ్యాన్ బేస్ ను పెంచుకున్నారు.

శివతో మాస్ ఇమేజ్ సంపాదించిన ఆయన.. అన్నమయ్య, మన్మథుడు వంటి విభిన్న సినిమాలతో అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువయ్యారు. మాస్, క్లాస్ అనే తేడా లేకుండా నాగార్జునకు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఏర్పడింది. మూడో జెనరేషన్ లో నాగచైతన్య, అఖిల్ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. నాగచైతన్య ప్రేమకథలు, యూత్ ఫుల్ సినిమాలతో మంచి క్రేజ్ సంపాదించగా.. అఖిల్ కూడా ప్రత్యేకమైన ఫాలోయింగ్ పెంచుకుంటున్నారు. అక్కినేని కుటుంబ అభిమానుల ప్రత్యేకత ఏమిటంటే.. ఇది కేవలం ఒక హీరోకు సంబంధించిన ఫ్యాన్స్ అసోసియేషన్ కాదు. ఒక కుటుంబంతో ప్రేక్షకులకు ఏర్పడిన రిలేషన్. తాతను అభిమానించిన కుటుంబాలు.. ఇప్పుడు మనవళ్ల సినిమాలను కూడా అదే ప్రేమతో ఆదరిస్తున్నాయి. మూడు జెనరేషన్ల అక్కినేని హీరోలు కలిసి నటించిన 'మనం' సినిమా కూడా ఆ రిలేషన్ కు సింబల్ గా నిలిచింది. కుటుంబం, అభిమానులు, సినిమా అనే మూడు అంశాలను కలిపిన అరుదైన సందర్భంగా అది గుర్తుండిపోయింది. అందుకే అక్కినేని ఫ్యామిలీకి అభిమానులు కేవలం ఆడియన్స్ కాదు.. వారి జర్నీలో పార్టనర్స్ అంట!

# సినిమాల్లోనే కాదు..
# పెట్టుబడుల్లోనూ నయనతార సూపర్ ప్లానింగ్!


ఇటీవలి కాలంలో సినీ ప్రముఖుల పెట్టుబడుల ధోరణిలో రియల్ ఎస్టేట్ కీలక స్థానాన్ని సంపాదించుకుంది. ఇటీవలి కాలంలో సినీ ప్రముఖుల పెట్టుబడుల ధోరణిలో రియల్ ఎస్టేట్ కీలక స్థానాన్ని సంపాదించుకుంది. ముఖ్యంగా మెట్రో నగరాల్లోని ప్రైమ్ లొకేషన్లలో లగ్జరీ ఇళ్లు, విల్లాలు, అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేయడం స్టార్‌లలో పెరుగుతున్న ట్రెండ్‌గా కనిపిస్తోంది. కెరీర్‌లో సంపాదించిన ధనాన్ని దీర్ఘకాలిక ఆస్తులుగా మార్చుకోవడం, కుటుంబానికి ఒక మంచి సేఫ్టీ, లగ్జరీ ఇంటిని ఏర్పరచుకోవడం, ఫ్యూచర్ పెట్టుబడిగా వాల్యూ పెరిగే ఏరియాను సెలెక్ట్ చేసుకోవడం వంటి కారణాలతో సినీ ప్రముఖులు రియల్ ఎస్టేట్‌పై ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ట్రెండ్‌లో తాజాగా సౌత్ స్టార్ హీరోయిన్ నయనతార పేరు కూడా చేరింది. చెన్నైలోని అత్యంత ప్రతిష్టాత్మక ప్రాంతాల్లో ఒకటైన పోయెస్ గార్డెన్‌లో సుమారు రూ. 40 కోట్ల విలువైన లగ్జరీ విల్లాను ఆమె కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ కొనుగోలు సినీ, రియల్ ఎస్టేట్ వర్గాల్లో ఆసక్తికర అంశంగా మారింది. చెన్నైలో పోయెస్ గార్డెన్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్నో దశాబ్దాలుగా ఇది రాజకీయ, సినీ ప్రముఖులుండే ఏరియాగా పేరొందింది. ప్రశాంతమైన వాతావరణం, అత్యున్నత భద్రత, నగరంలోని కీలక ప్రాంతాలకు అనుసంధానం, పరిమిత స్థల లభ్యత వంటి అంశాలు ఈ ఏరియాను అత్యంత విలువైన అడ్రస్‌గా నిలబెట్టాయి. అందుకే ఇక్కడ ఆస్తి కొనుగోలు



చేయడం కేవలం నివాస అవసరంగా కాకుండా, ప్రిస్టీజియస్ ఇన్వెస్ట్‌మెంట్‌గా కూడా పరిగణించబడుతోంది. గత కొన్నేళ్లుగా స్టార్ నటీనటులు కమర్షియల్ ప్రాపర్టీలు, లగ్జరీ విల్లాలు, హైఎండ్ రెసిడెన్షియల్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెంచుతున్న ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం సినిమా ఆదాయం పైనే ఆధారపడకుండా, ఆస్తుల రూపంలో సంపదను విస్తరించుకోవడం ఇప్పుడు సెలబ్రిటీల ఆర్థిక ప్రణాళికలో భాగంగా మారిందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రైమ్ లొకేషన్లలో ల్యాండ్ వాల్యూ రెగ్యులర్ గా పెరుగుతుండటంతో, ఇలాంటి ఇన్వెస్ట్‌మెంట్స్ ఫ్యూచర్ లో మరింత లాభదాయకంగా మారే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో నయనతార కెరీర్ కూడా బిజీగానే కొనసాగుతోంది. వరుస సినిమాలతో ఆమె సౌత్ సినీ ఇండస్ట్రీలో అత్యధిక డిమాండ్ ఉన్న హీరోయిన్ లలో ఒకరిగా కొనసాగుతున్నారు. కెరీర్‌లో స్థిరమైన మార్కెట్‌ను కొనసాగిస్తూనే, ఆర్థికంగా విలువైన ఆస్తులపై దృష్టి పెట్టడం ద్వారా దీర్ఘకాలిక ప్లానింగ్‌ను అమలు చేస్తున్న స్టార్‌ల లిస్ట్‌లో ఆమె కూడా నిలిచినట్టే కనిపిస్తోంది. సినీ ప్రపంచంలో స్టార్‌డమ్ ఎంత ముఖ్యమో, దాంతో వచ్చిన సంపాదనను సరైన పెట్టుబడులుగా మలచుకోవడం కూడా అంతే కీలకమనే విషయాన్ని ఈ పరిణామాలు మరోసారి గుర్తు చేస్తున్నాయి.

# 'ఆదర్శ కుటుంబం' నుంచి
# నారా హీరో లుక్, రోల్ రివీల్!

మన టాలీవుడ్ సీనియర్ హీరోస్ లో మోస్ట్ లవబుల్ హీరో అయినటువంటి వెంకీ మామ హీరోగా శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న అవైటెడ్ చిత్రమే 'ఆదర్శ కుటుంబం'. మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ లో నారా వారి హీరో నారా రోహిత్ కూడా నటిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. నేడు తన పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ బర్త్ డే విషెస్ చెబుతూ తన లుక్ పోస్టర్ ని రివీల్ చేశారు. అయితే ఇందులో రోహిత్ మంచి డైనమిక్ లుక్ లో కనిపిస్తుండగా బ్యాక్గ్రౌండ్ లో తెలంగాణ పోలీస్ బోర్డు కనిపిస్తుంది. సో దీంతో తాను ఈ సినిమాలో పోలీస్ రోల్ చేస్తున్నట్టు కన్ఫర్మ్ అయ్యిపోయింది. ఓ మాస్ పోలీస్ ఆఫీసర్ గా తాను కనిపించనున్నారని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రంకి థమన్ సంగీతం అందిస్తుండగా హారికా హాసిని వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది అక్టోబర్ 2న సినిమాని గ్రాండ్ గా విడుదల చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.




# బుక్ మై షోలో
# 'చెన్నై లవ్ స్టోరీ'కి సూపర్ రెస్పాన్స్!

లేటెస్ట్ గా మన టాలీవుడ్ నుంచి వచ్చిన సూపర్ హిట్ చిత్రాల్లో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం హీరోగా శ్రీ గౌరీ ప్రియా హీరోయిన్ గా దర్శకుడు రవి నంబూరి తెరకెక్కించిన అద్భుతమైన ప్రేమ కథా చిత్రమే చెన్నై లవ్ స్టోరీ. నేషనల్ అవార్డు విన్నర్ సాయి రాజేష్ అందించిన కథతో వచ్చిన ఈ సినిమా ప్రీమియర్స్ తోనే మాసివ్ రెస్పాన్స్ అందుకొని అదరగొట్టింది. ఇక్కడ నుంచి బుక్ మై షోలో సూపర్ రెస్పాన్స్ ని చెన్నై లవ్ స్టోరీ నమోదు చేసింది. రిలీజ్ రోజుకే అందులో లక్ష 50 వేలకి పైగా టికెట్ సేల్స్ ని ఈ చిత్రం జరుపుకోవడం విశేషం. దీనితో ఈ సినిమా ఓపెనింగ్స్ కూడా గట్టిగానే ఉంటాయి. ఇక డే 2 కూడా చెన్నై లవ్ స్టోరీ బుకింగ్స్ గట్టిగానే కొనసాగుతున్నాయి. సో ఈ వీకెండ్ కి సినిమా మరింత బెటర్ వసూళ్లు రాబట్టే ఛాన్స్ ఉంది. ఇక ఈ సినిమాకి మణిశర్మ సంగీతం అందించగా ఎస్ కే ఎన్ మరియు సాయి రాజేష్ లు నిర్మాణం వహించారు.



# అక్కినేని పెద్ద కోడలు శోభిత..
# రెండేళ్లలో ఇదే ఫస్ట్ టైమ్ అంట!

అక్కినేని ఇంటి సరదా ముచ్చట్లు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. అక్కినేని ఇంటి సరదా ముచ్చట్లు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. సాధారణంగా పర్సనల్ విషయాలను తక్కువగా పంచుకునే నాగచైతన్య.. ఈసారి తన భార్య శోభిత ధూళిపాళ గురించి పెట్టిన ఓ చిన్న పోస్ట్ తో అభిమానుల దృష్టిని ఆకర్షించారు. "పెళ్లయిన దాదాపు రెండేళ్ల తర్వాత నా వైఫ్ నా కోసం వంట చేసింది. ఈ రోజు నేను ఏదో మంచి పని చేసి ఉంటాను" అంటూ చైతూ చేసిన ఫన్నీ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఆ పోస్ట్ తో అభిమానులు మాత్రమే కాదు, నెటిజన్లు కూడా ఆసక్తికర చర్చ మొదలుపెట్టారు. నిజంగానే శోభితకు వంట రాదా? లేక ఇది కపుల్ మధ్య జరిగే ఫన్నీ కన్వర్జేషన్ లో భాగమా? అంటూ కామెంట్లు చేస్తున్నారు. శోభిత కూడా దీనికి తగ్గట్టుగానే రెస్పాండ్ అవుతూ.. "నన్ను ట్రోల్ చేస్తున్నావా? లేక పొగుడుతున్నావా?" అంటూ కామెంట్ చేయడం విశేషం. చైతూ షేర్ చేసిన ఫొటోలో శోభిత రెండు ప్లేట్స్ లో భోజనం పట్టుకుని నవ్వుతో కనిపించింది. ఎలాంటి హంగులు, ఆర్భాటాలు లేకుండా ఎంతో సాధారణంగా కనిపించిన ఆమెను చూసి ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. సెలబ్రిటీలు కూడా తమ వ్యక్తిగత జీవితంలో ఇలాంటి చిన్న చిన్న మూమెంట్స్ ను ఆస్వాదిస్తారనే విషయాన్ని ఆ పోస్ట్ మరోసారి గుర్తు చేసింది. అయితే ఆ ఫన్నీ పోస్ట్ వెనుక ఒక చిన్న బ్యాక్ గ్రౌండ్ ఉంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో వీరిద్దరిని "ఇంట్లో ఎవరు బాగా వంట చేస్తారు?" అని అడిగినప్పుడు నాగచైతన్య సరదాగా స్పందించారు. "నేను ప్రతిరోజూ హాట్ చాక్లెట్ చేస్తాను. కానీ అది వంట కిందకు రాదు. శోభితకు ఇంకా ఆ ప్రైమరీ టాలెంట్ కూడా లేదు" అంటూ నవ్వుతూ చెప్పారు. అప్పట్లో ఆ కామెంట్స్ కూడా సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. ఆ తర్వాత శోభిత ఓ షూటింగ్ సమయంలో వంట చేస్తున్న ఫొటోలను పంచుకుంటూ చైతూకు ఇన్ డైరెక్ట్ గా కౌంటర్ ఇచ్చారు. దీంతో "నీ చేతి వంట కోసం ఎదురుచూస్తున్నా" అని నాగచైతన్య కామెంట్ చేయడం అభిమానులను ఆకట్టుకుంది. ఇప్పుడు చూస్తే, అప్పట్లో చేసిన ఆ కామెంట్స్ కు ఇదే కంటిన్యూషన్ గా తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఆ జంట తమ కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితాన్ని కూడా ఎంజాయ్ చేస్తున్నారు.



2024లో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన నాగచైతన్య, శోభిత.. తరచూ సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు లవ్ చూపించుకుంటూ అభిమానులను అలరిస్తుంటారు. ఏదేమైనా శోభిత నిజంగా రెండేళ్ల తర్వాత మొదటిసారి వంట చేసిందా?

లేక నాగచైతన్య తనదైన శైలిలో సరదాగా కామెంట్ చేశారా? అన్నది పక్కన పెడితే.. ఆ పోస్ట్ మాత్రం అక్కినేని అభిమానులకు మంచి ఎంటర్టైన్మెంట్ అందించింది. సెలబ్రిటీల లైఫ్స్ లో కూడా ఇలాంటి చిన్న చిన్న స్వీట్ మూమెంట్స్ అభిమానులను మరింత దగ్గర చేస్తాయని చెప్పడంలో ఎలాంటి డౌట్ లేదు.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555